క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు భాస్కర్‌రెడ్డి 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 7 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల అందజేత



రాజంపేట : రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు చేతుల మీదుగా పాఠశాలల హెచ్‌ఎం పాఠ్యపుస్తకాలను అందజేశారు. మండలానికి వంద శాతం పాఠ్యపుస్తకాలు అందాయని వీటిని పాఠశాలల వారిగా పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వర్, విజయ లక్ష్మి, సీఆర్‌పీ సాయిరెడ్డి, లింగం, సూర్యపాల్, రమేశ్ పాల్గొన్నారు.

సురేశ్ షెట్కార్‌కు సన్మానం



పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ యూత్ నాయకులు సౌదాగర్ అరవింద్ హైదరాబాద్‌లోని ఎంపీ సురేశ్ షెట్కార్ నివాసంలో శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలిచిన సందర్భంగా సన్మానించారు. ఆయన వెంట బిచ్కుంద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు షెట్కార్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన వినీత శుక్రవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీని పోచారం అభినందించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీలు తదితరులున్నారు.

గోవధను నిరోధించాలి



కామారెడ్డి క్రైం : అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించి గోవధను ఆపాలని గో సంరక్షణ సమితి, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు. వారు శుక్రవారం కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులు పవిత్రంగా భావించే గోవులను కొందరు అక్రమంగా తరలిస్తూ హతమారుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షక నాయకులు కనికంటి రాజు, విశ్వహిందూ పరిషత్ నాయకులు బొల్లి రాజు, వడ్ల వెంకటస్వామి, వంగ ప్రసాద్, అశోక్, విశ్వనాథం, బీజేపీ నాయకులు ఆకుల భరత్, బజరంగ్‌దళ్ నాయకులు రాజు యాదవ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయం



భిక్కనూరు : విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయంగా ప్రజలకు సేవలు అందజేస్తారని వారి సేవలు అభినందనీయమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి అన్నారు. శుక్రవారం ఉత్తమ ఉద్యోగులుగా ప్రభుత్వంచే ప్రశంసపత్రాలు పొందిన ట్రాన్స్‌కో ఏఈలు పున్న లక్ష్మీనారాయణ, బత్తుల లక్ష్మీనర్సింలు, లైన్‌మెన్ నీల శివకుమార్‌ను ముదిరాజ్ మండల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు గంగళ్ల స్వామి, ప్రతినిధులు ఉప్పరి రాములు, నంద రమేశ్, ఉప్పరి బాల శ్రీకాంత్ ఉప్పరి యాదగిరి తదితరులున్నారు.

‘సర్కారు బడి తల్లిబడి లాంటిది’



లచ్చాపేటలో బడిబాటలో భాగంగా సర్కారు బడులపై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మాచారెడ్డి : సర్కార్ బడి తల్లి ఒడి వంటిదని, మీ పిల్లల్ని మా బడికే పంపించాలని మండలంలోని లచ్చాపేట హెచ్‌ఎం లక్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తామని చెప్పారు. సర్కార్ బడిలో విషయ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మెన్ నర్సింలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, బాల్‌రాజ్ గౌడ్, భవాని ఉన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలో బడిబాటలో ఉపాధ్యాయులు పాల్గొని ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందే సంక్షేమ ఫలాలను వివరించి విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గునిగెరి హన్మాండ్లు, ఉపాధ్యాయులు ఇందిర, హరి ప్రసాద్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రమైన పిట్లం, మండలంలోని కంబాపూర్, మద్దెల్‌చెరువు, చిన్నకొడప్‌గల్ తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్‌లో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం మండలంలోని లింగారెడ్డిపేట, సబ్దల్‌పూర్, వెల్లుట్ల, తిమ్మారెడ్డి, కళ్యాణి గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతు చిన్నారుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో శుక్రవారం రెండవరోజు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి గ్రామాలను సందర్శించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

తలమడ్లలో..

రాజంపేట : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలమడ్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం హెచ్‌ఎం దొమ్మటి భిక్షపతి ఆధ్వర్యంలో తలమడ్లలో ఇంటింటికీ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావుసాని యదవరెడ్డి, ఉపాధ్యాయులు చక్రపాణి, ఆంజనేయులు, నరసింహారెడ్డి, నారాయణ, ప్రభాకర్, అరుణ పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. పాఠశాలల టీచర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను వివరించారు. హెచ్‌ఎంలు, టీచర్లు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలో శుక్రవారం గ్రామస్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇండ్లలో బోనాలను వివిధ రంగులతో అందంగా అలంకరించారు. అనంతరంగా డప్పువాయిద్యాలతో బోనాలను గ్రామంలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుండా గ్రామ దేవతలు ఆలయాల వద్ద వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు.

ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మీసానిపల్లి గ్రామంలో శుక్రవారం ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేకంగా పూజలను నిర్వహించారు. అన్నదానం చేశారు. బోనాలు సమర్పించారు. మాజీ సర్పంచ్ రాజ్యలక్ష్మి, మాజీ సొసైటీ చైర్మెన్ బొండ్ల సాయిలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్ తదితరులున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దమ్మ తల్లి ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు అన్నదానం నిర్వహించారు. పెద్దమ్మ ఉత్సవాలు ప్రతీ ఏటా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుపుతున్నారు. ఈసారి పెద్దమ్మ ఆలయం వద్ద ముందుగా మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గొట్టం అనుసూయ, గోర్గంటి సంగమబీరాములు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి. కాశీనాథ్, సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థినికి సన్మానం



బాన్సువాడ : బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన తబుస్సుం అలీ నీట్‌లో 591 మార్కులు సాధించారు. ఇందుకుగాను గ్రామస్తులు ఆమెను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి హన్మాండ్లు, గణేష్, పెద్ద సాయిలు, విఠల్ రెడ్డి, మధుసూదన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలతో విలువలు పెరుగుతాయి



కామారెడ్డి రూరల్ : పీపుల్స్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ముఖ్య ఉద్దేశం లీడ్ విత్ వ్యాల్యూస్ అని సదాశివనగర్ ఎంఈఓ యోసేఫ్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో నిర్మించిన పిఎఫ్‌ఐ డెవలప్మెంట్ సెంటర్లో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

పన్ను వసూళ్లలో సిబ్బంది వేగం పెంచాలి



భిక్కనూరు : ప్రజల నుంచి జీపీకి రావాల్సిన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని భిక్కనూరు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జీపీ కాంప్లెక్సుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అద్దె విషయంలో వెంటనే సంబంధికులకు నోటీసులు ఇవ్వాలన్నారు. పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలన్నారు. డివైడర్ల మధ్య మొక్కలను తొలగించాలన్నారు. ఆయన వెంట ఈవో మహేశ్‌గౌడ్, క్లర్కులు సిద్దరాములు, సిబ్బంది భూషణం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



రామారెడ్డి : విద్యాశాఖ అనుమతి లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సదాశివనగర్ మండల కేంద్రంలో రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ప్రచారం కొనసాగిస్తున్న సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈవో యోసెఫ్ వివరణ కోరగా ఆ స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేవని ప్రచారం చేసినా అడ్మిషన్లు తీసుకున్నా చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి తాడ్వాయి ఎంపీపీ కొడి రవి పాల్గొని తాడ్వాయి మండల సమస్యలపై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్లను ఇవ్వాలని, ఆర్‌అండ్‌బీ రోడ్లను బాగుచేయాలని, కరెంట్ సమస్యలను తీర్చాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

నిరుపేద కుటుంబానికి సాయం



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న రాజమౌళి

భిక్కనూరు : మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన నిరుపేద మాసుల పెద్ద సాయిలు కుటుంబానికి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళి ఐదనెలలకు సరిపడా నిత్యావసరాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ సాయిలు కుటుంబానికి ఇళ్లు కూడా లేని దయనీయ స్థితిని తెలుసుకుని సాయం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది గంగారెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



భిక్కనూరులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

భిక్కనూరు : డీలర్లు నకిలీ పురుగు మందులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. శుక్రవారం ఆమె భిక్కనూరు మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో ఉన్న పురుగు మందులు, విత్తనాల దుకాణాలను ఆమే తనిఖీ చేశారు. ఆమె వెంట ఏవో రాధ ఏఈవోలు వినోద్‌గౌడ్, ఆనంద్, అఖిలేష్, ప్రసాద్, రజిత ఉన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

కామారెడ్డి అర్బన్ : ఎరువులు, విత్తనాల డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిష్టర్లు నిర్వహించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, విక్రయించిన వాటి వివరాలను ఈ పాస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. గోదాం ఉంటే ముందే లైసెన్స్‌లో చూపాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని ఏఈవోలు పాల్గొన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ టీం బాన్సువాడ ఏడీఏ వీరాస్వామి హెచ్చరించారు. మండలంలోని మేనూర్, మద్నూర్‌లోని విత్తన, ఎరువులు దుకాణాలపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజు, బాన్సువాడ ఏవో సుధాకర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



రాజంపేట : మండలంలో సమస్యలు పరిష్కరించడం లేదని శుక్రవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సైపై ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి ఫిర్యాదు అందజేసినట్లు మండల బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని, స్టేషన్‌కు వెళ్తే ప్రతి పనిని వాయిదా వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిట్ల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు గుర్రాల రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందన



కామారెడ్డి అర్బన్ : విధుల్లో అధికారులు, సిబ్బంది అందించిన సహకారంతో ఎన్నికల నిర్వహణ విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, నాయకులు ఎం.నాగరాజు, దేవరాజు తదితరులున్నారు.

నూతన గదులు నిర్మించాలి



కూలిన తరగతి గదిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి ఉన్నత పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకొని కూలిపోతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 8 గదులు ఉన్నాయి. 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 8 గదుల్లో 6 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని గోడలు కూలిపోతున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వం ఇటీవల మరమ్మతులకు నిధులు విడుదల చేసి పాఠశాలల మరమ్మత్తులు చేపడుతున్నారు. శెట్పల్లిసంగారెడ్డి ఉన్నత పాఠశాలలో 6 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త గదులు నిర్మించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం పాఠశాలను డీఈ, ఏఈలు సందర్శించి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహిద్, అంజయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల హవా



కామారెడ్డి అర్బన్ : వరంగల్ జేఎన్ స్టేడియంలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్స్, యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-18లో జావెలిన్ త్రోలో బి.ఈశ్వర్ ప్రసాద్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. గురువారం నిర్వహించిన పోటీల్లో ఆర్.నరేష్, ఎం.ఈశ్వర్, కే.నవీన్, కే.సునీల్, ఆర్.సెహ్వాగ్‌లతో పాటు శుక్రవారం కాంస్య పతకం పొందిన బి.ఈశ్వర్‌ను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు అభినందించారు. వీరందరు జాతీయ స్థాయిలో రాణించడానికి తగిన శిక్షణ ఇస్తామన్నారు.

ఘనంగా మృగశిర కార్తె



మద్నూర్(జుక్కల్) : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రజలు మృగశిర కార్తెను ఘనంగా జరుపుకున్నారు. వేసవి కాలం ముగిసి వర్షకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా రైతులు వ్యవసాయ పనుల కోసం సిద్ధం చేసుకుంటున్నారు. మృగశిర కార్తెతో మండల కేంద్రంలో చేపల విక్రయం బాగా జరిగింది. అలాగే మామిడి పండ్ల విక్రయాలు ఊపందుకున్నాయి.

యూనిఫామ్స్ సిద్ధం చేయాలి



యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్



బిచ్కుందలో..

నిజాంసాగర్(జుక్కల్) : ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో యూనిఫామ్స్‌ను సిద్ధం చేయాలని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంతో పాటు కొత్తబాది గ్రామంలో యూనిఫామ్స్ కుట్టు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందేలా చూడాలని చెప్పారు. ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

సకాలంలో అందించాలి

బిచ్కుంద(జుక్కల్) : సకాలంలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయాలని ఎంపీడీవో ఆనంద్ అన్నారు. శుక్రవారం బిచ్కుందలో యూనిఫాం కుడుతున్న సెంటర్‌ను సందర్శించి జతలు పరిశీలించారు. మండలంలో 4,600 జతలు కుట్టాల్సి ఉన్నందున పనులు వేగంగా జరగాలన్నారు.

సంక్షిప్తం

బైక్ ర్యాలీని సక్సెస్ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఈనెల 11న నిర్వహించనున్న బైక్ ర్యాలీని సక్సెస్ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెల 11న జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించేందుకు కార్మికులందం కలిసి బైక్ ర్యాలీ ద్వారా వెళ్తున్నామన్నారు.


11న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 11న ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు వారి వారి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

నూతన భవన నిర్మాణం ప్రారంభం

బాన్సువాడ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని అందులో భాగంగా నూతన భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా వైద్య సేవలను మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోకి, జూనియర్ కళాశాల ఉర్దు మీడియం భవనంలోకి మార్చామన్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్, ఫార్మసీ, అన్ని రకాల ఔట్ పేషెంట్ సేవలు, ల్యాబ్ సేవలు, ఎక్స్ రే, కిచెన్, ఉర్దూ మీడియం ఇన్ పేషెంట్, ఏఆర్టీ సేవలు, ఏరియా ఆస్పత్రి పాత భవనంలో పోస్టుమార్టం, లాండ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీసేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఉంచి ఆశ్రమం ఆవరణలో భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు.

పట్టణంలో సమస్యలు పరిష్కరించండి



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసారు. కలెక్టర్ చాంబర్‌లో పట్టణ సమస్యలపై చర్చించారు. పట్టణ సమస్యలను కలెక్టర్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు, దోమల నివారణపై తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. పట్టణంలో వీధిదీపాలు, పార్కు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, వంశీ తదితరులున్నారు.